# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-04-2025** **సమయం : 3.30 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశంలో తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జ్ – పాంబన్ వంతెనను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు.**

**2.** **శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, దేశ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.**

**3.** **అయోధ్యలో బాలరాముని ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.**

**4.** **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ రేపు, ఎల్లుండి అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటిస్తారు.**

**5.** **పోలవరం నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు.**

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు తమిళనాడులో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దేశంలో తొలి వర్టికల్ లిఫ్ట్ రైల్వే సీ బ్రిడ్జ్ – పాంబన్ వంతెనను ప్రధాని రిమోట్ పద్ధతిలో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో 535 కోట్ల రూపాయలతో ఈ బ్రిడ్జ్‌ను నిర్మించారు. సముద్రంలో 2.08 కిలోమీటర్ల పొడవున దీన్ని తీర్చిదిద్దారు. ఈ పర్యటనలో భాగంగా రామేశ్వరం–తాంబరం ప్రత్యేక రైలును ప్రధాని ప్రారంభించారు. అనంతరం రామేశ్వర ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ...

..వాయిస్... 37 సెకన్లు

--------------------------

శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. దేశ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి జీవిత ప్రయాణం సత్యం, ధర్మం నీతి మార్గాన్ని అనుసరించడానికి అందరికీ ప్రేరణగా నిలుస్తుందని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు. రాముని ఆశీస్సులు దేశాన్ని అన్ని విషయాలలో మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

---------------------------

అయోధ్యలో బాలరాముని ఆలయ నిర్మాణం తర్వాత రెండో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఈ మధ్యాహ్నం 12 గంటలకు భానుడి సూర్యకిరణాలు బాలరాముడి నుదిటిపై తిలకం దిద్దాయి. కాగా.. తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో భక్తులు ఆలయాలకు తరలి వెళ్ళి దేవతామూర్తులను దర్శించుకుంటున్నారు.

శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. మిథిలా మైదానంలో ఈ కల్యాణ క్రతువును ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైఎస్సార్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా ఈరోజు ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిచారు. 11వ తేదీన సీతారాముల కల్యాణం జరగనుంది.

తిరుమలలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రంగనాయకుల మండపంలో శ్రీ సీతా లక్ష్మణ సమేత హనుమంతుల వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈరోజు సాయంత్రం 6 గంటల 30 నిమిషాల నుండి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహనసేవ జరగనుంది. ఆ తరువాత రాత్రి 9 నుండి 10 గంటల నడుమ బంగారువాకిలి చెంత శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా తిరుమల తిరుపతి దేవస్తానం అధికారులు నిర్వహించనున్నారు.

---------------------------

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ రేపు, ఎల్లుండి అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించనున్నారు. రేపు ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి విశాఖపట్నం విమానాశ్రయానికి ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం పోతంగి పంచాయతీ చాపరాయి వద్దకు వెళతారు. ఉదయం ముత్యాలమ్మ గుడికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం పెదపాడు గ్రామానికి కాలినడకన చేరుకుని పీఎం జన్‌మన్ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఇదే గ్రామంలో మోదమాంబ బాట నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రజలతో సమావేశమవుతారు. 8వ తేదీ ఉదయం సుంకరమెట్ట గ్రామంలో ఎకో-టూరిజం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని అధికాలు తెలిపారు.

---------------------------

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు ఆలయ మహాద్వారం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామల రావు, అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి ఘనంగా స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు.

---------------------------

పోలవరం నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం కట్టుబడి ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న ఆరోపణలను ఆమె తోసిపుచ్చారు. ఎత్తు ఎంత ఉండాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని విషయమని పేర్కొంటూ...

..వాయిస్ ..35 సెకన్లు....

---------------------------

ఐపీఎల్ 2025లో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్ – హైదరాబాద్ సన్‌రైజర్స్‌ల మధ్య మ్యాచ్ జరగనుంది. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో రాత్రి 7 గంటల 30 నిమిషాలకు మ్యాచ్ మొదలుకానుంది. విజయంతో ఐపీఎల్ 2025 సీజన్ ఆరంభించిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. దీంతో పాయింట్ల పట్టికలో 10వ స్థానంలో నిలిచింది. మరోవైపు, తొలి ఓటమి తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో టాప్–5లో నిలిచింది.

---------------------------

ప్రభుత్వ ఆదేశాలతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. గంజాయి విక్రయించినా సేవించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని

..వాయిస్: 32 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు....

---------------------------

కృష్ణా జిల్లా, మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ – పీజీ కోర్సులో చేరే విద్యార్థులకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ఎల్.సుశీల తెలిపారు. పీజీ సెట్ 2025ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని, ఈనెల30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తయిన విద్యార్థులతో పాటు డిగ్రీ ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫీజు రీయంబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు నుంచి కొవ్వూరు వరకూ గోదావరిపై నిర్మించిన గామన్ వంతెన నిర్వహణ పనుల్లో భాగంగా వారం రోజుల పాటు ఒకవైపు మాత్రమే రాకపోకలను అనుమతిస్తామని అధికారలు తెలిపారు. ఈరోజు నుంచి 12వ తేదీ రాత్రి వరకు కొవ్వూరు–రాజమహేంద్రవరం మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై గామన్ ప్రాజెక్టు పాత్ ఇండియా కంపెనీ టోల్‌ప్లాజా మేనేజర్ రాజీవ్ జాదోన్ నిన్న మాట్లాడుతూ వంతెన నిర్వహణ పనులు చేపట్టనున్న కారణంగా వారం రోజుల పాటు ఒకవైపు మాత్రమే రాకపోకలు అనుమతిస్తామని వివరించారు. అలాగే 50 టన్నుల బరువులోపు ఉన్న వాహనాలను మాత్రమే అనుమతించాలని నిర్ణయించామన్నారు.

=====================